పేదింటికి ఉచిత వెలుగులు

- జగనన్న కాలనీల్లో జోరుగా విద్యుద్దీకరణ పనులు
- గృహాలకు ఉచితంగా కనెక్షన్లు
- మీటరు, సర్వీసు వైర్, బోర్డు మంజూరు
- సొంత స్థలం ఉన్నా కనెక్షన్ ఉచితం


నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో వైఎస్సార్ కాలనీలో ఏర్పాటుచేసిన విద్యుత్ లైన్


సమిశ్రగూడెం లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

నిడదవోలు రూరల్: పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అక్కడ విద్యుద్దీకరణ పనులు కూడా చురుగ్గా చేపడుతోంది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తుండగా మెరుగైన సరఫరా కోసం సబ్ స్టేషన్లను కూడా నిర్మిస్తున్నారు. అంతేగాకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా లబ్ధిదారుల ఇళ్లకు ప్రభుత్వమే ఉచితంగా విద్యుత్ మీటర్, సర్వీసు వైర్, బోర్డులు అందిస్తోంది. అవసరమైన సర్వీసులకు ఉచితంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, లైన్ లాగి కరెంట్ ఇవ్వనున్నారు. సొంత స్థలం కలిగి, గృహ నిర్మాణానికి రుణం మంజూరైన వారికి కూడా ప్రభుత్వం ఈ సేవలను ఉచితంగా అందిస్తోంది. వీటితో పాటు భవిష్యత్తులో ఉచితంగా ఫ్యాన్, ట్యూబ్ లైట్, ఎల్‌ఈడీ బల్బుల ఇవ్వడానికి ఒప్పందం చేసుకుంది.

నియోజకవర్గంలో ఇలా..

నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల పరిధిలో 136 జగనన్న కాలనీ లేఅవుట్లు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం 103 లేఅవుట్లలో విద్యుద్దీకరణ పనులు చేపట్టారు. మొత్తం లేఅవుట్లలో 11,700 సర్వీసులకు ఉచితంగా మీటర్లు అందించనున్నారు. ఇప్పటి వరకూ 1507 గృహ లబ్ధిదారులకు మీటర్లు అందజేసి విద్యుత్తు సౌకర్యం కల్పించారు. వాటితో పాటు సొంత స్థలం కలిగి గృహ నిర్మాణానికి ప్రభుత్వ రుణ సాయంతో ఇళ్లు నిర్మించుకున్న 213 మందికి ఉచితంగా కనెక్షన్లు ఇచ్చారు. ఒక్కొక్క సర్వీసుకు దాదాపు రూ. 3 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారు. వీటితో పాటు కాలనీల్లో స్తంభాలు, ఎల్‌ఈడీ దీపాలు, ట్రాన్స్‌ఫార్మర్లను రూ.22.60 కోట్ల వ్యయంతో చేపట్టారు. అలాగే విద్యుత్తు వైర్ల షిఫ్టింగ్, కాలనీల్లో తాగునీటి కోసం బోర్లకు విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేసేందుకు మరో రూ.2.50 కోట్లు ఖర్చు చేయనున్నారు.

200 యూనిట్ల ఉచిత విద్యుత్తు

జగనన్న కాలనీల్లో నివాసముంటున్న ఎస్సీ, ఎస్టీ సర్వీసులకు నెలకు దాదాపు రూ.1,000 విలువైన 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును సబ్సిడీ కింద ఇస్తున్నారు. భవిష్యత్‌లో నివాసాలకు ఉచితంగా ఎల్‌ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్‌లు, ఫ్యాన్‌ను ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకనుగుణంగా కాలనీల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

జగనన్న కాలనీల్లో చేపట్టిన విద్యుద్దీకరణ పనుల వివరాలు

మండలం	లేఅవుట్లు	ఇళ్ల స్థలాలు	మీటర్లు అందించిన గృహాలు	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)
నిడదవోలు	50	5095	715	10.72
ఉండ్రాజవరం	38	2652	574	8.61
పెరవలి	48	3953	218	3.27
మొత్తం	136	11,700	1507	22.60

మా జీవితాల్లోకి వెలుగులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన పేదలకు సొంతింటి కల నెరవేర్చి మా జీవితాల్లో వెలుగులు నింపారు. జగనన్న కాలనీలో విద్యుత్తు స్తంభాలతో పాటు ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేశారు. ఇళ్లకు దగ్గరలోనే విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు ఉచితంగా కరెంట్ సర్వీస్ కూడా ఇస్తున్నారు.
– షావుకారు ఈశ్వరి, సమిశ్రగూడెం

కాలనీల్లో నాణ్యంగా పనులు



జగనన్న కాలనీల్లో చేపట్టిన పనులు నాణ్యంగా జరుగుతున్నాయి. గృహాలకు ఉచితంగా విద్యుత్తు మీటర్లు, ఇతర పరికరాలు ఇస్తున్నాం. వాటితో పాటు హౌసింగ్ రుణం పొందిన వారికి కాలనీ బయట మీటర్లు అందజేస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు లైన్లు, స్తంభాలు ఏర్పాటు చేస్తున్నాం.
– బి.వీరభద్రరావు, ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, నిడదవోలు

క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

నల్లజర్ల: మానవత సేవాసంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నల్లజర్లలో మంగళవారం ఆ సంస్థ జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ పతాకావిష్కరణ చేశారు. నల్లజర్ల పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. మానవత సేవాసంస్థ మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, ఉపాధ్యక్షురాలు ఝాన్సీరాణి, మద్దిపాటి ప్రసాద్, గుళ్ళపూడి వెంకటరత్నం, భోగవల్లి వెంకటసుబ్బారావు, గుత్తికొండ ప్రసాద్, యస్.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో వన మహోత్సవం


మొక్క నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు

నిడదవోలు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంగళవారం రోటరీ క్లబ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో స్థానిక బసివిరెడ్డిపేటలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ప్రవాస భారతీయుడు బత్తుల నందకిషోర్ ఆర్థిక సాయం అందించారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, కార్యదర్శి గుంటుపల్లి నాగవెంకట శివకుమార్, గోపిరెడ్డి శ్రీనివాస్, కాళ్ల రాంబాబు, గొన్నాబత్తుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

రక్షాబంధన్ వారోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్‌ఎస్ఎస్ నాయకులు

నిడదవోలు: దేశ, ధర్మ, సమాజ రక్షణలో అలుపెరుగని పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు, ఛత్రపతి శివాజీల స్ఫూర్తితో ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 03 వరకూ నిర్వహించే జన జాగరణ రక్షాబంధన్ వారోత్సవాలను హిందువులందరూ విజయవంతం చేయాలని ఆర్‌ఎస్ఎస్ నాయకులు కోరారు. రక్షాబంధన్ వారోత్సవాల వాల్ పోస్టర్లను మంగళవారం స్థానిక గోలింగేశ్వర స్వామి వారి ఆలయంలోని గీతా మందిరంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ఎస్ నాయకులు గమిని వెంకటరత్నం, వేదుల సిద్ధు, బండి సూర్యనారాయణ, బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు నీలం రామారావు, ఆకుల సత్యనారాయణ స్వామి, చింతా నందు, తుట్టగుంట రమణ మూర్తి, బలిజిపల్లి చందు, చక్కా భాస్కరరావులు పాల్గొన్నారు.

కార్గో సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నిడదవోలు: స్థానిక ఆర్టీసీ డిపోలో కార్గో సెంటర్ కార్యకలాపాల నిర్వహణకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు నిడదవోలు డిపో మేనేజర్ శ్రీరామ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా డిపో మేనేజర్ కార్యాలయంలో ఈ నెల 26 తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వాహనదారులు రూల్స్ పాటించాలి

ఉండ్రాజవరం: వాహనదారులందరూ విధిగా వాహన నిబంధనలు పాటించాలని ఎస్సై కె.రామారావు మంగళవారం సూచించారు. ప్రయాణ సమయాల్లో వాహనాల పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. బాల బాలికలు ద్విచక్ర వాహనం నడిపితే వాహన యజమానికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వాహనదారులు ప్రయాణ సమయాల్లో విధిగా హెల్మెట్ ధరించాలన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

నిడదవోలు రూరల్: బైక్ ఢీ కొనడంతో మండలంలోని కోరుమామిడి గ్రామంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆ గ్రామానికి చెందిన దాసి వెంకట్రావు ఈనెల 20న టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై ప్రధాన సెంటర్‌లోని కిరాణా షాపునకు వచ్చి ఇంటికి వెళుతున్నాడు. పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన మరో బైక్ ఢీకొట్టడంతో వెంకట్రావుకు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో అతడు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్సై ఎస్సై షేక్ సుభానీ మంగళవారం తెలిపారు.

విద్యుత్తు బిల్లులు ఆన్‌లైన్‌లోనూ చెల్లించండి

నల్లజర్ల: సమయం వృథా కాకుండా విద్యుత్తు వినియోగదారులు ఆన్‌లైన్‌లో కూడా బిల్లులు చెల్లించవచ్చని ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ బి.వీరభద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్తు బిల్లుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా విద్యుత్తు బిల్లులు చెల్లించవచ్చన్నారు. కాగా విద్యుత్తు సర్వీసులను విధిగా ఆధార్ కార్డుతో అనుసంధానం చేయించుకోవాలన్నారు. సర్వీసు మీటర్‌కు ఆధార్ అనుసంధానం కాని వారు తమ ఆధార్ జిరాక్స్ కాపీని సంబంధిత ఉప విద్యుత్తు కార్యాలయంలో అందజేయాలన్నారు. ఒకవేళ సర్వీసు పూర్వీకుల పేరున ఉంటే వారసులు సంబంధిత పత్రాలు, ఆధార్ జిరాక్స్ కాపీలను అందజేయాలన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుపై ఏమైనా సందేహాలు ఉంటే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు.

శివారు ప్రాంతాలను సమీప పంచాయతీల్లో కలపాలి

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం సచివాలయం పరిధిలోని శివారు ప్రాంతాలను సమీప పంచాయతీల్లో కలపాలను వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం పెద్దేవం సర్పంచ్ తిరిగిపల్లి వెంకటరావుకు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణకు, పంచాయతీ కార్యదర్శి సువర్చలకు వినతి పత్రాలు అందజేశారు. చిడిపి శివారు 11వ వార్డును చిడిపి పంచాయతీలోను, పెద్దేవం శివారు 10వ వార్డును బల్లిపాడు పంచాయతీలో విలీనం చేయాలని వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు కంకిపాటి రవి, పసలపూడి రాజశేఖర్, పూలపల్లి ప్రకాష్ తదితరులు వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని హోం మంత్రి తానేటి వనిత దృష్టికి తీసుకు వెళతామని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- విజ్జేశ్వరంలో గడప గడపకూ..


విజ్జేశ్వరంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: గతంలో ఏ ప్రభుత్వంలో జరగని విధంగా జగనన్న ప్రభుత్వంలో అర్హత గల ప్రతి గడపకూ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని విజ్జేశ్వరం గ్రామంలో మంగళవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ తిక్కా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేస్తూ పేదల జీవితాల్లో మార్పులు తెస్తున్నారన్నారు. విజ్జేశ్వరంలోని పెండ్యాల పంపింగ్ స్కీమ్ ద్వారా రైతులకు రెండు పంటలకు పూర్తి స్థాయిలో నీరు అందిస్తున్నామన్నారు. విజ్జేశ్వరం గ్రామస్తుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమళ్ల దుర్గారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పట్టాలు సిద్ధం చేయండి

- అధికారులకు ఎమ్మెల్యే తలారి ఆదేశం
- దేవరపల్లి లే అవుట్‌లో అదనంగా సేకరించిన భూమి పరిశీలన


దేవరపల్లి లేఅవుట్‌లోని అదనపు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: స్థానిక జగన్న లే అవుట్‌లో 90 రోజుల కార్యక్రమంలో భాగంగా గుర్తించిన లబ్ధిదారులకు పట్టాలు సిద్ధం చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధికారులను ఆదేశించారు. దేవరపల్లిలోని జగనన్న లే అవుట్‌లో అదనంగా కొనుగోలు చేసిన 11 ఎకరాల భూమిని మంగళవారం ఎమ్మెల్యే, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుర్తించిన లబ్ధిదారులకు పట్టాలు సిద్ధం చేసి పంపిణీ చేయాలన్నారు. వెంటనే స్థలాన్ని లెవిలింగ్ చేసి రాళ్లు పాతాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి సంక్రాంతి నాటికి గృహ ప్రవేశాలు జరగాలన్నారు. సర్పంచ్ కడిమి వీరకుమారి మాట్లాడుతూ ఈ కాలనీలో కమ్యూనిటీ పర్పస్ (సీపీ) కోసం రెండెకరాల స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే వెంకట్రావును కోరారు. అతిపెద్ద కాలనీ ఏర్పాటవుతున్నందున భవిష్యత్తు అవసరాలకు స్థలం అవసరమని ఆమె అన్నారు. సీపీ కింద ఎకరం స్థలాన్ని కేటాయిస్తున్నట్టు తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, గృహనిర్మాణ శాఖ డీఈఈ టి.శేఖర్ బాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షులు కూచిపూడి సతీష్, ఎంపీటీసీ సభ్యురాలు పల్లికొండ రామలక్ష్మి, గృహనిర్మాణ శాఖ ఏటీ ధర్మారావు, రెవెన్యూ, విద్యుత్తు, గృహనిర్మాణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిరు జన్మదినం సందర్భంగా రక్తదానం


నల్లజర్లలో రక్తదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

నల్లజర్ల: సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడకలను ఆయన అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. నల్లజర్లలో సుమారు 50 మంది అభిమానులు రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ఆసుపత్రిలోని రోగులకు పాలు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమాల్లో గట్టు గోపీకృష్ణ, జనసేన నాయకులు చోడసాని బాపిరాజు, యంత్రపాటి రాజు, రుద్రా శ్రీనివాస్, కవులూరి సత్తిబాబు, వరుణ్, వామిశెట్టి బాబీ, దొండపాటి బాబు, యర్రా బాలాజీ పాల్గొన్నారు.

కె.సావరంలో వైద్య శిబిరం

ఉండ్రాజవరం: ప్రముఖ సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం మండలంలో కె.సావరం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిరంజీవి హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో తణుకు సన్స్ ఆసుపత్రి డాక్టర్ ఎస్.శోభాచరణ్ రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఆందజేశారు. అలాగే తేజ నేత్ర సెంటర్ వారు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు కాకర్ల కరుణాకర్, అందే భీమలింగేశ్వరరావు, వడ్డి హేమంత్‌కుమార్, పోలిశెట్టి రామకృష్ణ, పోలిశెట్టి శ్రీనివాసు, కాకర్ల జయరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ,జనసేన ఆధ్వర్యంలో..

దేవరపల్లి: మెగా స్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను దేవరపల్లిలో ఆయన అభిమానులు, వైఎస్సార్ సీపీ, జనసేన నాయకులు వేర్వేరుగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద గల మదర్ థెరిసా విగ్రహానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అభిమానులు, పార్టీ కార్యకర్తల సమక్షంలో దుర్గారావు కేక్ కట్ చేసి అందరికీ పంచారు.పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకుడు డి.సువర్ణరాజు మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ నాయకులు, జనసైనికుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కాట్నం గణేష్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరు గ్రామానికి చెందిన కోడి వీరబాబు అనే వ్యక్తి ఈనెల 13 నుంచి అదృశ్యమయ్యాడు. దీనిపై అతడి సోదరుడు చిన వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబురావు తెలిపారు. భార్య విడాకులు తీసుకోవడంతో వీరబాబు మానసికంగా బాధపడుతున్నట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. 13వ తేదీ తెల్లవారుజామున మోటార్ సైకిల్ తీసుకుని ఇంటి నుంచి వెళ్లిన వీరబాబు తిరిగి రాలేదని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి

నల్లజర్ల: భారతీయ సంస్కృతి, హిందూ సంప్రదాయాలు, ధర్మాన్ని పరిరక్షించడానికి గ్రామ ధార్మిక జట్లు కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ గోదావరి విభాగ్ కన్వీనర్ చింతాకుల గోపాలకృష్ణ సూచించారు. సమరసత సేవా ఫౌండేషన్ సమావేశం మంగళవారం అనంతపల్లిలోని అయ్యప్పదీక్ష మందిరంలో జరిగింది. సమావేశానికి కొవ్వూరు సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ ఉప్పలపాటి మాధవరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ 25 మందితో ధార్మిక జట్లను ఏర్పాటు చేసి గ్రామంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు.

ఆటలకు పేర్లు నమోదు చేసుకోండి

చాగల్లు: 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో బి.రాంప్రసాద్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 17 ఏళ్ల పైబడిన వారు తమ గ్రామ సచివాలయంలో బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి ఆటల్లో పాల్గొనేందుకు తమ పేరు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంఈవోలు ఖాదర్‌బాబు, సీహెచ్ సుభాకర్, పీడీ. పీఈటీలు పాల్గొన్నారు.

నేడు కొవ్వూరు 18వ వార్డులో గడప గడపకూ..

కొవ్వూరు: పట్టణంలోని 18వ వార్డులో బుధవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు కూడా పట్టణంలో 18వ వార్డు సత్యవతి నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొంటారు.

కొవ్వూరులో ఓ మోస్తరు వర్షం

కొవ్వూరు: మంగళవారం ఉదయం ఎనిమిదిన్నర గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో జిల్లాలో సరాసరిన 9.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అనపర్తిలో గరిష్టంగా 52.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలాల వారీగా రాజానగరంలో 20.0, బిక్కవోలులో 15.6, రాజమహేంద్రవరం అర్బన్‌లో 12.8, నల్లజర్లలో 10.2, కొవ్వూరులో 20.8, ఉండ్రాజవరంలో 7.6, పెరవలిలో 3.4, రంగంపేటలో 6.2, కడియంలో 2.8, కోరుకొండలో 4.4, గోకవరంలో 2.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఇక సీతానగరం, నిడదవోలు, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో వర్షం జాడ లేదు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఎండ తీవ్రత అధికంగా ఉంది.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి పరామర్శ

చాగల్లు: కడియం స్టేషన్‌లో పోలీసులు హింసించారని ఆరోపిస్తున్న చాగల్లు మండలం మార్కొండపాడు శివారు కుంకుడుమిల్లికి చెందిన దళిత యువకుడు వడ్డి వెంకట ప్రసాద్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మంగళవారం పరామర్శించారు. చాగల్లులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకట ప్రసాద్‌ను పరామర్శించి, ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ కడియం ఎస్‌ఐ శివాజీను సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ధర బాగుందని సాగు విస్తీర్ణం పెంచవద్దు

రైతులకు పొగాకు బోర్డు ఆర్‌ఎం సూచన


రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌ఎం ఆదిశేషయ్య

గోపాలపురం: పొగాకు బోర్డు సూచించిన విస్తీర్ణం మేరకే రైతులు పొగాకును ఉత్పత్తి చేయాలని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య అన్నారు.పొగాకు వేలం పూర్తయిన సందర్భంగా గోపాలపురం పొగాకు వేలం కేంద్రం వద్ద మంగళవారం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ ఏడాది వర్జీనియా పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నందున, వచ్చే సీజన్‌కు ఎక్కువ మంది రైతులు మామిడి, జీడిమామిడి పంటలను తొలగించి అధిక విస్తీర్ణంలో పొగాకు సాగు చేయవద్దని సూచించారు. వచ్చేఏడాడి అంతర్జాతీయ మార్కెట్‌ను అనుగుణంగా నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయాలన్నారు. వేలం కేంద్రం సూపరింటెండెంట్ కె.సాయి, సీనియర్ గ్రేడింగ్ అధికారి టి.హేమస్మిత, రైతు సంఘం అధ్యక్షుడు పిన్నమనేని మధుమోహన్, ఇల్లూరి రాంబాబు, కూసం రామమోహన్‌రెడ్డి, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, దుగ్గిరాల రాంబాబు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, వేలం కేంద్రం పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

ఆసుపత్రిపై అసత్య ప్రచారాలు తగదు


ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సుధాకర్, శ్రీనివాస్, సూపరింటెండెంట్ సాయికిరణ్

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిపై కొందరు వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వరిగేటి సుధాకర్, నగళ్లపాటి శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఆసుపత్రి వద్ద మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. శనివారం అర్ధరాత్రి ఆసుపత్రి మోటార్ పాడవంతో తాగునీటి అవసరాలకు ప్రత్యామ్నాయంగా వేరొక బోరు నీటిని అందిస్తున్నామన్నారు. ఆసుపత్రిలోని రోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటా మన్నారు. హోం మంత్రి తానేటి వనిత నూతన బోరు ఏర్పాటుకు జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే ప్రతిపాదనలు పంపారన్నారు. త్వరలోనే నూతన బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యామ్నాయ బోరు ద్వారా తాగునీటికి ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తున్నప్పటికీ కొందరు ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నంలో భాగంగా అసత్య ఆరోపణ చేయడం సమజసం కాదన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులుంటే చెప్పండి.. సరి చేయిస్తాం

- కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు
- ఓటరు సర్వేపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష


ఇంటింటి సర్వే ప్రగతిపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

కొవ్వూరు: నియోజకవర్గంలో ఇప్పటికీ సర్వే పూర్తి కాని ప్రాంతాల ఓటర్ల జాబితాలో ఏమైనా తేడాలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే సరి చేయిస్తామని కొవ్వూరు ఆర్డీవో, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్. మల్లిబాబు సూచించారు. నియోజకవర్గంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సాయంత్రం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఫారం–6,7,8 ల నమోదు ప్రగతిని వివరించారు. ఇంటింటి సర్వే ఈనెల 25 వరకూ కొనసాగుతుందన్నారు. నియోజకవర్గంలో మొత్తం 73,056 గృహాలు ఉండగా, ఇప్పటి వరకూ 71,512 గృహాలను సిబ్బంది సర్వే చేశామన్నారు. మొత్తం 1,77,620 ఓటర్లకు గాను 1,44,488 ఓట్లను తనిఖీ చేసి ఆన్‌లైన్ చేయించినట్లు ఆర్డీవో ప్రకటించారు. ఇంటింటి సర్వేలో బూత్ లెవెల్ అధికారులు ఫారం–6ల ద్వారా 1,209 ఓటర్లను చేర్పించారన్నారు. మరణించిన, వలస వెళ్లిన 1,929 ఓట్లను తొలగింపు నిమిత్తం ఫారం–7 ను దరఖాస్తు చేశారన్నారు. ఓటర్ల జాబితాలో తప్పొప్పులు, చిరునామా మార్పులు, చేర్పుల వంటి వాటి కోసం ఫారం–8 దరఖాస్తులు 3,702 స్వీకరించామన్నారు. చాగల్లు తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, తాళ్లపూడి డిప్యూటీ తహసీల్దార్ షేక్ లాల్ అహ్మద్, కొవ్వూరు డిప్యూటీ తహసీల్దార్ సునీత, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఆర్డీవో కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి జారి పడి వ్యక్తి మృతి

దేవరపల్లి: ఇక్కడి నుంచి గోపాలపురం వెళ్లే రోడ్డులోని డైమండ్ జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో దేవరపల్లి మండలం సుబ్బరాయపురానికి చెందిన పెనుమాల దుర్గారావు (35) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మరో ముగ్గురు వ్యక్తులతో కలసి దుర్గారావు యాదవోలు పొలాల నుంచి ట్రాక్టర్‌పై పుల్లలలోడు వేసుకుని గోపాలపురం వెళుతున్నారు. డ్రైవర్‌తో పాటు ముగ్గురు వ్యక్తులు ట్రాక్టర్‌పై వెళుతుండగా, డైమండ్ జంక్షన్ వద్ద పెనుమాక దుర్గారావు జారి కింద పడ్డాడు. అతడి తలపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు దేవరపల్లి ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.